# తెల్ల దోమలు

– అలపర్తి రామకృష్ణ




ఆదిశేషయ్యని పల కరించే నాథుడే లేడు.

అప్పుల సుడిగుండంలో చిక్కుకుపోయిన బక్కచిక్కిన రైతన్నను ఎవరు పల కరిస్తారు? దేశానికి వెన్నెముకలాంటి వాడివని మెరమెచ్చులతో మురిపించే వాళ్ళే గాని రైతాంగం కష్టాలు తీర్చేదెవరు?

పసుపు కళ్ళంలో ఒంటరిగా కూర్చుని ఆలోచనలో మునిగిపోయాడు. అతని మొహంలో విచారం గూడుకట్టుకుని ఉంది. అతని ముఖంలో నవ్వు చోటుచేసుకుని అయిదేళ్ళయింది.

అయిదేళ్ళనుంచీ వర్షాలు లేవు. పొలాలన్నీ బీడు లయ్యాయి. ఈసారి పంటలు బాగానే పండాయి గాని చివర్లో పంటలకు చీడపీడలు అధికమయ్యాయి.

పదెకెరాల్లో పత్తి వేశా డతను. రెండెకరాల మెట్టలో పసుపు వేశాడు. అతని కున్నది అయిదెకరాల పొలం మాత్రమే. మిగతా పొలం కౌలుకి తీసుకున్నాడు.

తెల్లదోమ తెగులు పట్టి పత్తి పంట బాగా దెబ్బతింది. పత్తి దిగుబడి తగ్గిపోయింది. చెమటోడ్చి సాగుచేసిన పంట కళ్ళముందే సర్వనాశనమయ్యేసరికి దిగులుపడ్డా డతను.

తండ్రి గుర్తుకు వచ్చాడు అతనికి ఆ క్షణంలో. పాతి కెకరాల రైతు తన తండ్రి. 'పుడమి తల్లిని నమ్ముకుంటే కష్టాలేరా' అంటుండేవాడు. ఆయన మాటలు తను నమ్మేవాడు కాదు. వ్యవసాయం చెయ్యడం చేతగాక అలా అంటున్నా డనుకునేవాడు.

పాతి కెకరాల పొలం హారతి కర్పూరంలా కరిగిపోయి అయిదెకరాలకు తగ్గిపోయింది. అప్పుల ఊబిలో గొంతువరకూ కూరుకుపోయి ఆత్మహత్య చేసుకున్నాడు తన తండ్రి. ఎందుకు అన్ని అప్పులు చేశా డాయన?

ఆయన పెద్దగా చదువుకోలేదు. ఎన్ని పుట్లు పసుపు పండిందో? పండిన పత్తికి, వేరుశెనక్కాయలకు వ్యాపారులు ఎంత ముట్టజెప్పుతున్నారో, తాను ఎంత వడ్డీకి అప్పులు తెస్తున్నాడో తెలిసేది కాదు. అసలు కంటే వడ్డీ ఎక్కువయ్యేది.

పండుగ లొచ్చినా, పెళ్ళిళ్ళు జరిగినా చాలా ఆర్భాటంగా చేసేవాడు నాన్న. తాతయ్య తద్దినమని, మనవరాలి చెవులు కుట్టిస్తున్నామని, మనవడికి పంచె లిస్తున్నామని ఊళ్ళో అందరినీ భోజనాలకు పిలిచేవాడు. వీటికి తోడు ఇంట్లో దుబారా ఖర్చులు. తడిసి మోపెడయ్యేది అప్పు.

నెల రోజుల్లో ఇరవై రోజులు గుంటూరులోనే మకాం పెట్టేవాడు. ఇంట్లో అమ్మకి కోర్టు పనులు ఉండే వనేవాడు. ఊళ్ళో నగంమంది ఒకరిమీద మరొకరు వ్యాజ్యం నడిపినవాళ్ళే. వారం రోజులు కోర్టు పనులు ఉంటే, మరో పది రోజులు సరదాగా పేకాట ఆడుతూనో, తాగుతూనో, వ్యభిచార గృహాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే కాలం గడిపేవాళ్ళు.

నాన్నకి వ్యవసాయం చెయ్యడం తెలీక ఆస్తి అంతా పాడుచేశాడు గాని, తన చేతుల్లోకి అజమాయిషీ వస్తే బ్రహ్మాండం బద్దలు చెయ్యొచ్చు ననుకున్నాడు.

తండ్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాక కుటుంబ భారం తనమీదే పడింది. అయిదెకరాల పొలం తన చేతుల్లోకి వచ్చింది. మరో పదెకరాల దాకా కౌలుకు తీసుకుని పదేళ్ళు వ్యవసాయం చేశాడు తను. పైసా వెనుకెయ్యలేకపోయేడు. కోర్టు

గొడవల్లో దిగకుండా, దుబారా చెయ్యకుండా పొదుపు పాటించినా తనూ అప్పుల్లో మునిగిపోయేడు.

ఆ అప్పులన్నీ పంటలు పండించడానికి పెట్టిన పెట్టుబడులే ! కొన్ని సంవత్సరాలు అతివృష్టి, మరి కొన్ని సంవత్సరాలు అనావృష్టి. ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కకపోగా, అప్పుల బాధ ఎక్కువైంది.

దూరంగా గట్టుమీద తెల్లటి బట్టల్లో మెరిసిపోతూ, చేతిలో ఉన్న గొడుగును విలాసంగా తిప్పుకుంటూ వస్తున్న వ్యక్తిమీద ఆదిశేషయ్య దృష్టి పడింది.

ఆ వ్యక్తి దగ్గర కొచ్చేక గుర్తు పట్టేడు.

"ఓరీ... నువ్వటయ్యా వరహాలూ? గుర్తు పట్టలేకపోయానయ్యా. క్రిందటి సంవత్సరం పత్తి కొనడానికి వచ్చినప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పు వచ్చింది. కండపట్టి గుమ్మటంలా తయారయ్యావ్" అన్నాడు ఆదిశేషయ్య నవ్వుతూ.

"నువ్వే అయిదెకరాల రైతువి. నాకేమో ఎకరం పొలం కూడా లేదు. నా అవస్థలు నీకేం తెలుసునయ్యా?" అంటూ ఆదిశేషయ్య పక్కనే చతికిలబడ్డాడు వరహాలు.

ఆ క్షణంలో తను ఏనుగుమీద అంబారీలో కూర్చున్నట్లు, వరహాలు నేలమీద తన ముందు మోకరినట్లు అనుభూతి చెందాడు. కళ్ళముందు కళ్ళంలో కనిపిస్తున్న పసుపుకొమ్ములు, ఇంట్లో రెండు గదుల నిండా పేర్చిన పత్తి బేళ్ళు అతన్ని శ్రీకృష్ణుణ్ణి చేశాయి. వరహాలు కుచేలుడిగా కనిపించేడు.

ఆదిశేషయ్య విలాసంగా వరహాలు వైపు చూశాడు.

"పత్తి అమ్ముతావా?" వరహాలు అడిగేడు.

"పత్తి విషయం మాట్లాడుకుందాం గాని, ముందు పసుపు కొనుక్కుంటావా?"

వరహాలు కళ్ళం దగ్గర కెళ్ళాడు పసుపు నాణ్యత పరిశీలించడానికి. గుప్పెడు పసుపు కొమ్ములు చేతిలోకి తీసుకుని ఓ క్షణం పరీక్షగా చూసి పెదవి విరుస్తూ వాటిని కింద పడేశాడు.

ఆదిశేషయ్య మనస్సు చివుక్కుమంది. తను కష్టపడి పండించిన పసుపును నాణ్యత లేదన్నట్లుగా వరహాలు చులకన చేసి చూడటం అతనికి నచ్చలేదు.

"నీకు అవసరం లేకపోతే అమ్మనులేవయ్యా. మరొకరికి అమ్ముకుంటాను" అన్నాడు ఆదిశేషయ్య.

"ఈ సంవత్సరం పసుపు విపరీతంగా పండింది. ఏ రైతు దగ్గరకు వెళ్ళినా పసుపు అమ్ముతా నంటున్నాడు. మీకు ఎక్కువ ధర ఇచ్చి కొని మళ్ళీ అమ్మాలంటే మా తలప్రాణం తోకకు వస్తుంది. పసుపు ధర బాగా పడిపోయిందయ్యా. నీకు చెబితే నువ్వు నమ్మవు గాని పసుపు కొనడానికి ఎవ్వరూ ముందుకు రావడంలేదు" అన్నాడు వరహాలు తాపీగా.

"మా ఊళ్ళో నే నొక్కడినే పసుపు వేసింది. మిగతా వాళ్ళకి పసుపు ఉడకబెట్టడం కూడా సరిగా రాదు." గర్వంగా అన్నాడు ఆదిశేషయ్య.

"చిన్న చిన్న వ్యాపారాలంటే మాకు చిరాకయ్యా. ముందు పత్తి అమ్మకం తేల్చుకుందాం. పసుపు మరెవరికన్నా అమ్ముకో." లేచిపోయి ముందుకు నాలుగడుగులు వేశాడు వరహాలు.

పసుపు కొనడానికి వరహాలు ఉత్సాహం చూపకపోయేసరికి ఆదిశేషయ్యకి చిరుచెమట పట్టింది.

పసుపు అమ్మిన డబ్బుతో సంవత్సరానికి సరిపడా తిండిగింజలు, పశువుల మేత కొనాలనుకున్నాడు. పత్తి అమ్మగా వచ్చిన డబ్బు బాంక్ ఋణాలకు, వడ్డీ వ్యాపారస్థుల అప్పులు తీర్చడానికే సరిపోతుంది. ఏదో ఒక విధంగా పత్తి, పసుపు అమ్మేస్తే గాని అప్పుల బాధ తీరదు. ఇప్పుడు అప్పులు తీర్చకపోతే వచ్చే సంవత్సరం పంట ఖర్చులకు పెట్టుబడి ఎవ్వరూ ఇవ్వరు.

"ఏదోక రేటుకు తీసుకోవయ్యా." అనేశాడు ఆదిశేషయ్య.

ఆ మాటకోసం ఎదురుచూస్తున్నాడు వరహాలు. అతని కళ్ళు విజయగర్వంతో మెరిశాయి.

"ఆదిశేషయ్యా! నువ్వేదో అనుకుంటావ్ నేను తక్కువ ధరకి మీరు పండించిన పంటలు కొనుక్కుని లక్షలు లక్షలు సంపాదిస్తున్నానని. క్వింటాలుకు ఓ పది రూపాయలు మిగిలితే చాలు. ఎండలో, దుమ్ములో పడి మీ ఊళ్ళ చుట్టూ తిరుగుతున్నందుకు ఆమాత్రం లాభం లేకపోతే ఎలాగయ్యా? పైగా నేను రొక్కం వెంటనే ఇచ్చేస్తాను. మిగతా వ్యాపారస్థులు డబ్బు వెంటనే ఇవ్వరు."

వెనుకటిలాగా కాకుండా ఈ సంవత్సరం వరహాలుతో గట్టిగా మాట్లాడి గిట్టుబాటు ధర తను పండించిన పత్తికి, పసుపుకు తీసుకోవా లనుకున్నాడు.

వరహాలు మాటలు అతన్ని నిరుత్సాహ పరిచేయి. 'రొక్కం' అన్న మాట అతనిమీద బాగా పని చేసింది.

"మార్కెట్ ధర ఎలాగుంటే అలా తీసుకోవయ్యా. నీకు, నాకు నష్టంలేని పద్ధతిలోనే పోదాం." రాజీ ధోరణితో అన్నాడు ఆదిశేషయ్య.

"మార్కెట్ ధర నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే. ఈ రోజు ఉన్న ధర రేపుండదు. "పసుపు కొమ్ములు పెద్దగా నాణ్యంగా లేవు. క్వింటాలుకు అయిదొందల ధర ఇస్తాను."

"మార్కెట్‌లో తొమ్మిది వందల ధర ఉంటే నువ్వు అయిదొందలు ఇస్తానంటే ఎలాగయ్యా?"

"నీ ఇష్టం. గుంటూరు తీసుకెళ్ళి మార్కెట్‌లోనే అమ్ముకో." అనేసి లేచి నిలబడ్డాడు వరహాలు.

గతంలో ఓసారి ఆ అనుభవం కూడా అయ్యింది.

చచ్చిచెడి బండ్ల కెత్తుకుని గుంటూరు తీసుకెళ్ళితే అక్కడ వాళ్ళు అడిగిన ధరకే మారుమాట లేకుండా అమ్ముకోవాల్సి వచ్చింది. అక్కడ వ్యాపారస్థుల దంతా ఓ సంఘం. రైతుల దగ్గరనుంచి కొనుగోలు చేసేటప్పుడు తక్కువ ధర ఇవ్వడం, వాళ్ళు అమ్ముకునేటప్పుడు ఎక్కువ ధరకు ఇవ్వడం - అందరిదీ ఒకటే మాట అక్కడ.

తెల్లటి పరుపుల మీద కూర్చుని తెల్లగా మెరిసిపోయే ఆ వ్యాపారస్థులు ఆదిశేషయ్య కళ్ళలో మెదిలేరు.

"నువ్వు బాగా తెలిసినవాడివి. ఎప్పటీనుంచో ఏది పండినా నాకే అమ్ముతున్నావ్. నీ కష్టం తెలియనివాడిని కాదు. చివరిసారిగా అడుగుతున్నా - క్వింటాలు ఆరొందలకు ఇవ్వు." అన్నాడు వరహాలు రెండడుగులు ముందుకు వేస్తూ.

మారుమాట లేకుండా తలూపేడు ఆదిశేషయ్య. ఆ క్షణంలో వరహాలు కుబేరుడుగానూ, తాను కుచేలుడిగానూ మారినట్లు అనిపించింది.

"మా కాటా వాళ్ళు వెంకట్రామయ్య కందుల కళ్ళంలో ఉన్నారు. పిలుచుకు వస్తాను" అంటూ హుషారుగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు వరహాలు.


అరగంట గడిచేక కాటా, గోతాలు, ఎడ్లబండితో సహా తిరిగొచ్చేడు వరహాలు.

కళ్ళంలోని పసుపంతా గోతాల్లోకి వెళ్ళిపోయింది. అక్కడికక్కడే లెక్కకట్టి తోలుసంచిలోంచి డబ్బు తీసి ఆదిశేషయ్యకు ఇచ్చేశాడు.

దబ్బనంలో పురికొన దూర్చి గోతాలు కుట్టే సమయంలో వచ్చింది ఆదిశేషయ్య కూతురు రాధ.

"ఇంట్లో వాడకానికి ఓ గంపెడు పసుపుకొమ్ములు పట్టుకురమ్మంది అమ్మ" అంది తండ్రితో రాధ.

ఏం చెప్పాలో తోచక తికమకపడ్డాడు



ఆదిశేషయ్య.పసుపంతా అమ్మేసి డబ్బు కూడా తీసుకున్నాడు వరహాలు దగ్గర. ఇప్పుడెలా ఓ గంపెడు పసుపు కొమ్ములు ఇమ్మని అడుగుతాడు? అతను ఇవ్వనంటే తన పరువేం గావాలి?

"అదేమిటయ్యా. ఆడపిల్ల పసుపుకొమ్ములు అడిగితే లేవంటావా? నువ్వు మొయ్యగలిగినన్ని పసుపుకొమ్ములు తీసుకెళ్ళమ్మా." ఓ గంపెడు కంటే ఎక్కువ మొయ్యలేదని వరహాలుకు తెలిసే అన్నాడు.

వరహాలు తన కేదో దానం చేస్తున్నట్లుగా మాట్లాడటం ఆదిశేషయ్య మనస్సును నొప్పించింది. తను పండించిన పసుపుపైన అతనికి అధికారం ఏర్పడింది అప్పుడే. తీసుకోవద్దన్నట్లు కళ్ళతోనే కూతురికి సైగలు చేశాడతను.

వట్టి చేతులతోనే ఇంటికి తిరిగి వెళ్ళిపోయింది రాధ.

ఆమాటా ఈమాటా మాట్లాడుకుంటూ వరహాలుతో కలిసి ఇంటికి తిరిగి వచ్చేసరికి వరండాలో కూర్చుని చుట్ట కాలుస్తున్న సుబ్బయ్యను చూడగానే ఆదిశేషయ్య గుండెల్లో రాయి పడింది.

"నా దగ్గర ఏడెకరాల పొలం కౌలుకు తీసుకుని మూడేళ్ళ నుంచి పంటలు పండించుకుంటున్నావ్. కౌలు కింద ఒక్క పైసా ఇవ్వలేదు. పంటలు పండలేదని రెండేళ్ళు ఊరుకున్నాను. ఇప్పుడు పసుపు అమ్మేసేవుగా? ఆ డబ్బు నా కిచ్చేయ్." పెద్దగా అరుస్తూ అన్నాడు సుబ్బయ్య.

అప్పటికే ఇంటిముందు నలుగురైదుగురు సుబ్బయ్య కేకలు విని చోద్యం చూస్తూ నిలబడిపోయారు.

మరో అయిదు నిముషాలు ఆగితే బూతుల పంచాంగం కూడా విప్పుతాడు సుబ్బయ్య. జేబులో నుంచి తీసి వరహాలు ఇచ్చిన మూడు వేలు సుబ్బయ్యకి ఇచ్చేశాడు. ముఖానికి నవ్వు పులుముకుని వెళ్ళిపోయాడు సుబ్బయ్య.

ఆదిశేషయ్య కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

"పత్తి అమ్మకం కూడా తేల్చేయ్యవయ్యా. తొందరగా వెళ్ళిపోవాలి నేను." తొందర చేశాడు వరహాలు.

పదెకరాల్లో పత్తి వేస్తే అయిదు క్వింటాళ్ళ కంటే ఎక్కువ పత్తి దిగుబడి రాలేదు. తెల్లదోమ తెగులు, పురుగు పట్టి పంటంతా పాడయిపోయింది. ముప్పయి వేల రూపాయలు బాంకు నుంచి, బయట మూడు రూపాయల వడ్డీకి అప్పులు తెచ్చి పత్తి పైరుమీద పెట్టాడు తను. చివరికి పురుగు ఏరించలేక పత్తిని చేలోనే వదిలెయ్యాల్సి వచ్చింది. అప్పులు మాత్రం తన వెంట వస్తున్నాయి.

"క్వింటాలు పత్తి వెయ్యి రూపాయలకు ఇచ్చేస్తాను తీసుకెళ్ళు" అన్నాడు ఆదిశేషయ్య.

"మరీ ఎక్కువ ధర చెబుతున్నావ్."

ఎక్కడా పత్తి బాగా పండలేదు. బాగా ధర కూడా ఉందని ఆదిశేషయ్యకి తెలుసు.

"ఇష్టమైతే తీసుకెళ్ళు. లేకపోతే నా పత్తి నా దగ్గరే ఉంటుంది." అనేశాడు మొండిగా.

క్వింటాలు వెయ్యి రూపాయిలకు కొనుక్కోక తప్పలేదు వరహాలుకు. పత్తి బేళ్ళు బండి మీదకు ఎక్కించి ఆదిశేషయ్యకు డబ్బు ఇచ్చేసి వెళ్ళిపోయాడు వరహాలు.

## ఇవ్వరా?

సెక్రటరీ: సార్. మీ పేరు మూడుసార్లు 'గిన్నిస్' బుక్‌లో కెక్కింది.

మంత్రి: మన పేరు వాళ్ళు మూడు సార్లు వాడుకొన్నందుకు గాను పారితోషికం ఇవ్వరా?

నిమ్మరాజు చంద్రభాను [గుంటూరు]

ఐదేళ్ళ క్రితం పత్తి మీద యాభై వేల రూపాయిలు లాభం వచ్చింది ఖర్చులు పోను. అందరికీ వివరీతంగా డబ్బొచ్చేసరికి అందరూ పత్తి పంట విరివిగా వెయ్యడం మొదలుపెట్టారు. ఇప్పు డేమో నష్టాల మీద నష్టాలు.

ఎప్పుడో ఎడ్ల జతను అమ్మేశాడు. ఇంట్లో బంగారం అంతా బాంక్‌లో తాకట్టు పెట్టాడు. యాభై వేలకు పైగా అప్పుంది. ఎలా తీర్చాలి? పత్తి అమ్మగా వచ్చిన ఈ ఐదు వేలు ఏ అప్పు తీరుస్తాయి?

ఆదిశేషయ్య భార్య వచ్చి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. అతను మంచినీళ్ళు తాగాక బాంక్‌వాళ్ళు పంపిన బంగారం వేలంపాట నోటీసు ఇచ్చింది.

ఆ నోటీసు చదివి చిరాగ్గా ఆ కాగితాన్ని ఉండ చుట్టి గిరాటు వేశాడు.

ఆ సమయంలోనే వచ్చాడు వడ్డీ వ్యాపారి నరహరి.

"వరహాలు నీకు ఐదు వేలు ఇచ్చాడటగా? ఐదు వేలు నా కిచ్చేయి. వడ్డీ కింద జమ చేసుకుంటాను. అసలు ఎప్పుడు ఇస్తావో, ఏమిటో?" ఆదిశేషయ్యకి తన నెవరో నిలువునా రంపంతో కోస్తున్న ట్లనిపించింది నరహరి మాటలు వింటుంటే.

విసురుగా వెళ్ళి బీరువాలో దాచిన ఐదు వేలు తెచ్చి నరహరికి ఇచ్చేసేడు.

"బాంక్‌లో బంగారం విడిపించరా?" నరహరి వెళ్ళిపోయాక అడిగింది ఆదిశేషయ్య భార్యన.

"పెద్దబ్బాయిని పై చదువులకు పట్నం ఎప్పుడు పంపుతారు? రాధకి పెళ్ళి ఎప్పుడు చేస్తారు? చేతిలో పైసా లేకుండా సంసారం గడిచే దెట్లా?" ఆమె ఇంకా ఏవేవో అడుగుతూనే ఉంది.

ఆదిశేషయ్య మౌనంగా ఉండిపోయాడు.

భర్త బాధపడుతున్నాడని గ్రహించి వెంటనే లోపలికి వెళ్ళిపోయింది ఆమె.

అతని కళ్ళ నిండా విషాదాశ్రువులు. ఆ కణ కణ మండే విలాపాగ్నులకు, విషాదాశ్రువులకు ఖరీదు కట్టే షరాబు ఎవరన్నా ఉన్నారా?

'పొలాలన్నీ... హలాల దున్నీ... ఇలా తలంలో హేమం పండించే' రైతు గుండెల్లో ఇప్పుడు విషాదం గూడు కట్టుకుని ఉంది. దరిద్ర దేవత విలయతాండవం చేస్తుంటే రైతన్న దయనీయ, దుర్భర పరిస్థితుల్లో చిక్కుకున్నాడు...

ఎదురుగా గూట్లో పురుగుల మందు కనిపించింది. అటూ ఇటూ చూసి దగ్గర్లో ఎవ్వరూ లేరని నిర్ధారణ చేసుకుని ఆ పురుగు మందు డబ్బా తీసి మూత విప్పాడు.

గుండెల్లో మంటలు చల్లారడానికి ఆ మందే శరణ్యం. మరో క్షణంలో ఒంటి నిండా చెమట పడుతుంది. ఒంట్లో వేడి తగ్గిపోతుంది. గొంతు ఎండుకుపోయి చనిపోతాడు తను.

వెంటనే ఏదో అనుమానమొచ్చిం దతనికి. ఆ కల్తీ పురుగు మందే తన కొంపముంచింది. పురుగు మందు పనిచెయ్యక పోవడం మూలంగానే పత్తి పంట పురుగుల పాలయింది. తెల్లదోమ తెగులు ఉధృతమైంది. ఆ మందు పనిచెయ్యక తను బ్రతికితేనో?

ఆ కల్తీ మందు తాగగానే తను వెంటనే చనిపోడు. హాస్పిటల్లో చేరుస్తారు. వందలు, వేలు అప్పు తెచ్చి తనని మళ్ళీ బ్రతికిస్తారు. మళ్ళీ తను బ్రతకడానికో, చావడానికో అప్పులు చెయ్యాలి. లాభం లేదు... ప్చ్!

పురుగు మందు డబ్బా మళ్ళీ గూట్లో పెట్టేశాడు ఆదిశేషయ్య. రైలు కింద పడి చనిపోవడమే సులభమేమో? ఆ ఆలోచన రాగానే రైల్వే స్టేషన్ వైపు పరుగు లాంటి నడకతో బయల్దేరాడు.

రైల్వే స్టేషన్‌కు కొంచెం దూరంగా రైలు పట్టాల మీద నిశ్చింతగా పడుకున్నాడు. రైలు కోసం ఎదురుచూస్తూ పడుకున్నాడు. నాలు గైదు గంటలు గడిచినా రైలు రాలేదు.

చుట్టూ చీకటి కమ్ముకుంది.

దోమలు ఆదిశేషయ్యని చుట్టు ముట్టేశాయి. ఒంట్లోని రక్త మంతా పీల్చే ప్రయత్నంలో మునిగిపోయాయి దోమలు.

ఆ నల్లదోమలకు ఆదిశేషయ్య భయపడే రకం కాదు. అతనికి తెల్లదోమ లంటేనే భయం.

వరహాలు....

సుబ్బయ్య....

నరహరి...

కల్తీ పురుగుల మందు తనకు అమ్మిన దుకాణదారులు. వీళ్ళంతా తనను పీల్చి పిప్పి చేసే తెల్లదోమలు.

నల్లదోమలు కేవలం రక్తాన్ని మాత్రమే పీలుస్తాయి. తెల్లదోమలు శరీరంలోని ఎముకల్ని, కండల్ని కొరుక్కు తింటాయి. వెంట్రుకల్ని, గోళ్ళనీ కూడా వదిలిపెట్టవ్.

ఎవరో భుజం తట్టి లేపడంతో రైలు పట్టాల మీద నుంచి ఉలిక్కిపడి లేచాడు ఆదిశేషయ్య. ఆ చీకట్లో కూడా నరహరిని గుర్తుపట్టాడు.

"రైతు లంతా ఆందోళన చేస్తూ రైళ్ళను పైన ఎక్కడో ఆపుతున్నారట. రైళ్ళు నడవవు గాని ఇంటికి పద." ఆదిశేషయ్య భుజం మీద చెయ్యి వేసి ముందుకు నడిపించేడు నరహరి.

తను చేసిన పనికి సిగ్గుపడ్డాడు ఆదిశేషయ్య. తను కనబడలేదని ఆందోళనతో ఎదురుచూసే భార్య, కొడుకులు కూతురు గుర్తుకు రాగానే కళ్ళు చెమర్చాయి. మరోసారి ఆత్మహత్యా ప్రయత్నం చెయ్యనని మనస్సులోనే చెంపలు వేసుకున్నాడు.

"నువ్వు ఇలాంటి పని ఏదో చేస్తావని నాకు తెలుసయ్యా! నా సొమ్ము గట్టిది కాబట్టి నా కళ్ళకు రైలు పట్టాల మీద నువ్వు కనిపించావు. రేపు ఉదయం దస్తావేజులు రాసుకుందాం. నీ పొలమంతా నాకు అమ్మేసెయ్. ఎకరానికి పదిహేను వేలు ఇస్తాను. నీ బాకీ పోను మిగిలిన డబ్బు పట్టుకుపోదువు గాని." చెప్పుకుపోతూనే ఉన్నాడు నరహరి.

తన భుజం మీద నరహరి చేయి చాలా బరువుగా తోచింది.

"నలభై వేలు చేసే పొలం పదిహేను వేలకు అమ్మాలా?" మనస్సులోనే గొణుక్కున్నాడు ఆదిశేషయ్య. ☆